కార్తీక పౌర్ణమి రోజున

గత కొన్నేళ్లుగా వరుస విజయాలతో దూసుకుపోతున్నారు అగ్ర హీరో బాలకృష్ణ. ప్రస్తుతం ఆయన తన 109వ చిత్రంలో నటిస్తున్నారు. బాబీ కొల్లి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సితార ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ నిర్మిస్తున్నారు. సంక్రాంతి కానుకగా వచ్చే ఏడాది జనవరిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా టైటిల్ ప్రకటన, టీజర్ గురించి అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఈ నెల 15న టైటిల్, టీజర్ విడుదల చేయబోతున్నట్లు మేకర్స్ తెలిపారు. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో బాలకృష్ణ ఆయుధాలు ధరించి యాక్షన్ మోడ్‌లో కనిపిస్తున్నారు. ఈ సినిమాలో ఆయన బందిపోటు పాత్రలో కనిపిస్తారని, పేదల పక్షపాతిగా ఆయన పాత్ర సాగుతుందని సమాచారం. బాలీవుడ్ నటుడు బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నారు. షూటింగ్ చివరి దశలో ఈ చిత్రాన్ని సంక్రాంతి సందర్భంగా భారీ స్థాయిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి తమన్ సంగీతాన్నందిస్తున్నారు.

వారణాసితో శ్రీకారం

మహేశ్‌బాబు, రాజమౌళి సినిమాకు సంబంధించిన అప్‌డేట్స్ కోసం ఆడియన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. రాజమౌళి మాత్రం ఈవేమీ పట్టించుకోకుండా కామ్‌గా తన పని తాను చేసుకుపోతున్నారు. ఓ వైపు ఈ సినిమాకు సంబంధించిన వర్క్‌షాపులు జరుగుతున్నాయి. మరోవైపు దర్శకధీరుడి పిలుపు కోసం మహేశ్ ఎదురుచూస్తూ ఉన్నారు. ఈ నేపథ్యంలో ఈ సినిమా కథకు సంబంధించిన ఓ ఇంట్రస్టింగ్ న్యూస్ వెలుగులోకి వచ్చింది. వారణాసి నేపథ్యంలో ఈ సినిమా కథ మొదలవుతుందట. ఆ తర్వాత కథ సౌతాఫ్రికాకు షిఫ్ట్ అవుతుందట. వారణాసి షెడ్యూల్ మొత్తాన్నీ ఓ సెట్‌లో పూర్తి చేయాలనే ఉద్దేశంతో ఉన్నారట రాజమౌళి. దానికోసం హైదరాబాద్ శివార్లలో భారీ కాశీ సెట్‌ను నిర్మించనున్నారనేది ఇన్‌సైడ్ టాక్. కథ ప్రకారం అటవీ నేపథ్యం ఎక్కువగా ఉంటుందని తెలుస్తున్నది. దానికోసం దట్టమైన అటవీ ప్రాంతాలను కూడా రెక్కీ చేస్తున్నారట. ఇప్పటికే కీరవాణి ఈ సినిమా మ్యూజిక్ సిట్టింగ్స్‌లో బిజీగా ఉన్నారు. తాజా సమాచారం ప్రకారం ఇండోనేషియాకు చెందిన ఓ అమ్మాయిని ఇందులో కథానాయికగా తీసుకున్నారట. ఫిబ్రవరి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానున్నట్టు తెలుస్తున్నది.

ఈ బొమ్మ సూపర్‌హిట్ కావాలి

'' ఈ ఏడాది 'హను-మాన్'తో తెలుగు సినిమాకు శుభారంభం మొదలైంది. చిన్న సినిమాలు పెద్ద విజయాలు అందుకున్నాయి. రీసెంట్‌గా దీపావళికి విడుదలైన అమరన్, క, లక్కీభాస్కర్ సినిమాలు కూడా విజయాలు సాధించడం నిజంగా మంచి పరిణామం. కంటెంట్ నమ్ముకొని చేసిన సినిమాలు అవన్నీ. సరిగ్గా తీస్తే చూడ్డానికి జనాలు సిద్ధంగా ఉన్నారు. రేపు 'జీబ్రా' కూడా మంచి కంటెంట్‌తో రాబోతున్నదని తెలుస్తోంది. ఈ బొమ్మ సూపర్‌హిట్ కావలి. తమ్ముడు సత్యదేవ్ మంచి నటుడు. ఓటీటీలో తాను చేసిన సినిమాలు చూసి, తనపై నమ్మకంతో నా 'గాడ్‌ఫాదర్'లో ఛాన్సిచ్చాను. నా నమ్మకాన్ని నిజం చేస్తూ అద్భుతంగా నటించాడు. ఈ సినిమా కూడా సత్యదేవ్‌కి మరింత పేరు తీసుకురావాలి. తనని నేను మరింత ఎత్తులో చూడాలి.'' అని అగ్రహీరో చిరంజీవి ఆకాంక్షించారు. సత్యదేవ్, డాలీ ధనుంజయ లీడ్‌రోల్స్ చేసిన యాక్షన్ ఎంటర్టైనర్ 'జీబ్రా'. ఈశ్వర్ కార్తీక్ దర్శకుడు. ఎస్.ఎన్.రెడ్డి, ఎస్.పద్మజ, బాలసుందరం, దినేష్ సుందరి నిర్మాతలు. నవంబర్ 22న సినిమా విడుదల కానుంది. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రీరిలీజ్ ఈవెంట్‌లో చిరంజీవి మాట్లాడారు. 'వీలునామాతో పనిలేకుండా తరతరాలు మారే ఆస్తి లాంటివారు చిరంజీవి. ఆయన వల్లే ఈ సినిమా నాకొచ్చింది. 'గాడ్‌ఫాదర్'లో నా పాత్ర చూశాకే ఈ సినిమాకు హీరోగా నన్ను తీసుకున్నారు. ఆయన ఈ ఈవెంట్‌కి రావడం మా అందరి అదృష్టం. ఓ విధంగా ఇది నా డెబ్యూ లాంటి సినిమా. ఈ సినిమా తర్వాత 'ఫుల్ బాటిల్' అనే సినిమా చేశాను. ఆ సినిమా కూడా కొత్తగా ఉంటుంది. ఇకనుంచి కొత్త సత్యదేవ్‌ని చూస్తారు.' అని సత్యదేవ్ అన్నారు. ఇంకా చిత్రబృందంతో పాటు దర్శకుడు ప్రశాంత్‌వర్మ కూడా ఈ వేడుకలో పాల్గొన్నారు.

'కుబేర' మథనం

ధనుష్, నాగార్జున, రష్మిక మందన్న ప్రధాన పాత్రల్లో శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'కుబేర'. ఈ సినిమా షూటింగ్ తుది దశకు చేరుకుంది. ఫస్ట్ గ్లింప్స్‌ను ఈ నెల 15న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో నాగార్జున సోఫాలో కూర్చొని దీర్ఘాలోచనలో ఉన్నట్లు కనిపిస్తున్నారు. సమాజంలోని ఆర్థిక అసమానతలు, డబ్బు పట్ల లోకం దృక్కోణాన్ని ఆవిష్కరిస్తూ యాక్షన్ థ్రిల్లర్‌గా దర్శకుడు శేఖర్ కమ్ముల ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారని సమాచారం. అంతర్లీనంగా ఆయన శైలి సందేశం ప్రధానాంశంగా ఉంటుందని చిత్ర బృందం పేర్కొంది. పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయబోతున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ స్వరకర్త.

రాబిన్‌హుడ్ యాక్షన్ అడ్వెంచర్



నితిన్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'రాబిన్‌హుడ్'. వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్నది. శ్రీలీల కథానాయిక. ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 14న విడుదల చేయబోతున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో హీరో నితిన్ తీక్షణమైన చూపులతో కనిపిస్తున్నారు. 'యాక్షన్, కామెడీ అంశాలు కలబోసిన పర్‌ఫెక్ట్ ఎంటర్‌టైనర్ ఇది. నితిన్ పాత్ర నవ్యరీతిలో సాగుతుంది. అత్యున్నత సాంకేతిక హంగులతో తెరకెక్కిస్తున్నాం' అని చిత్ర బృందం పేర్కొంది. రాజేంద్రప్రసాద్, వెన్నెల కిషోర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సాయిశ్రీరామ్, సంగీతం: జీవీ ప్రకాష్ కుమార్, నిర్మాతలు: నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, రచన-దర్శకత్వం: వెంకీ కుడుముల.

వరుణ్ అంటే మట్కానే గుర్తొస్తుంది

'ఓ పెళ్లికి వైజాగ్ వెళ్లినప్పుడు అక్కడ ఊహించని విషయాలు తెలిశాయి. ఒకప్పుడు వైజాగ్‌లో నైట్ క్లబ్బులు, క్యాబరేతో పాటు మట్కా గేమ్ పాపులర్. వైజాగ్ వన్ టౌన్ గురించి, అక్కడి కల్చర్ గురించి తెలుసుకున్నప్పుడు మట్కా గేమ్‌పై ఆసక్తి పెరిగింది. అసలు ఈ గేమ్ ఎవరిది? అనే పరిశోధన మొదలుపెట్టా. కథకునిగా 'వాడిపోయిన పువ్వులు' అనే పేరుతో చిన్న కథ రాయాలనుకున్నా. కానీ రాస్తున్నప్పుడు ఇది సినిమా మెటీరియల్ అని అర్థమైంది. అప్పుడు ట్రీట్మెంట్ వెర్షన్ రాశా. అది ఫస్ట్ డ్రాఫ్ట్. రేపు మీరు చూసేది 12 డ్రాఫ్ట్.' అని తెలిపారు దర్శకుడు కరుణకుమార్. ఆయన దర్శకత్వంలో వరుణ్‌తేజ్ హీరోగా రూపొందిన చిత్రం 'మట్కా'. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహి హీరోయిన్లు. డా.విజయేందర్‌రెడ్డి, రజనీ తాళ్లూరి హైబడ్జెట్‌లో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు కరుణకుమార్ విలేకరులతో ముచ్చటించారు. 'మట్కా పక్కా కమర్షియల్ సినిమా. నాన్‌స్టాప్ ఎంటర్‌టైనర్. ఫస్ట్ హాఫ్ స్టోరీ టెల్లింగ్‌తో అందర్నీ అలరించేలా ఉంటుంది. వరుణ్‌తేజ్ అంటే 20ఏండ్ల తర్వాత కూడా 'మట్కా'నే ప్రస్తావిస్తారు. పాకిస్తాన్ నుంచి ముంబై వచ్చిన రతన్ ఖత్రి జీవితానికి దగ్గరగా ఇందులో హీరో పాత్ర ఉంటుంది. 79రోజుల్లో అనుకున్న బడ్జెట్‌లో సినిమాను పూర్తి చేశా. సీన్ పేపర్ మీద ఉన్నప్పుడే దీనికి ఎలాంటి లైటింగ్ కావాలి.. ఎలాంటి లెన్స్ వాడాలో డిసైడ్ అయ్యాను. నిర్మాత సహకారం వల్లే ఈ సినిమాను డీటెయిల్‌గా తీయగలిగాను. జీవీ ప్రకాశ్ సంగీతం, కిశోర్‌కుమార్ ఛాయాగ్రహణం సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి.' అని చెప్పారు కరుణకుమార్.

గణపతివర్మ ఉగ్రరూపం

బెల్లంకొండ సాయిశ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ ప్రధానపాత్రధారులుగా రూపొందుతోన్న చిత్రం 'భైరవం'. విజయ్ కనకమేడల దర్శకుడు. కె.కె.రాధామోహన్ నిర్మాత. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉంది. మరోవైపు మేకర్స్ ఈ సినిమా ప్రమోషన్స్‌ని కూడా వేగవంతం చేశారు. రీసెంట్‌గా విడుదల చేసిన బెల్లంకొండ సాయిశ్రీనివాస్, నారా రోహిత్ ఫస్ట్‌లుక్ పోస్టర్లు సినిమాపై బజ్ క్రియేట్ చేశాయి. మంగళవారం గణపతివర్మగా మంచు మనోజ్ ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో ఆయన ఫెరోషియస్‌గా రగ్గెడ్ అవతార్‌లో కనిపిస్తున్నారు. మంచు మనోజ్‌ని గతంలో చూడని విధంగా ఇందులో చూడబోతున్నారని, గణపతివర్మగా ఆయన పాత్ర అత్యంత శక్తిమంతంగా ఉంటుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి మాటలు: సత్యర్షి, తూమ్ వెంకట్, కెమెరా: హరి కె.వేదాంతం, సంగీతం: శ్రీ చరణ్ పాకాల, సమర్పణ: డా.జయంతిలాల్ గడ.

కాస్త ఓపిక పట్టాలి!

ప్రస్తుతం తెలుగుతో పాటు హిందీలో కూడా వినూత్న కథాంశాల్లో నటించే అవకాశం లభిస్తున్నదని, తన కెరీర్‌లో ఇదొక కీలకమైన సమయమని వ్యాఖ్యానించింది రష్మిక మందన్న. స్క్రిప్ట్‌ల ఎంపిక విషయంలో తన అభిప్రాయాలు చాలా మారాయని, ఇప్పుడు సవాలుతో కూడిన పాత్రల కోసం ఎదురుచూస్తున్నానని పేర్కొంది. ఆమె మాట్లాడుతూ 'పాన్ ఇండియా నటిగా అన్ని భాషల వాళ్లను మెప్పించేలా కెరీర్‌ను ప్లాన్ చేసుకుంటున్నా. పుష్ప-2, హిందీలో 'ఛావా' వంటి చిత్రాలను ఓ సవాలుగా తీసుకున్నా. నటిగా నాలోని భిన్న కోణాల్ని ఆవిష్కరించుకునే ప్రయత్నం చేస్తున్నా. తెరపై చూసుకున్నప్పుడు నాకు నేనే సర్‌ప్రైజ్‌గా అనిపించాలి. అలాంటి పాత్రల్ని ఎంచుకుంటున్నా' అని చెప్పుకొచ్చింది. సోషల్‌మీడియాలో వచ్చే ట్రోలింగ్స్, వ్యక్తిగత విమర్శల గురించి మాట్లాడుతూ 'అనవసరమైన విషయాల మీద దృష్టి పెట్టి నాలోని ఎనర్జీని వృథా చేసుకోను. నేను ప్రతీ విషయంలో ఆశావహ దృక్పథంతో ఉంటాను. సినీ రంగంలో సహనం అన్నింటి కంటే చాలా ప్రధానమైనది. కాస్త ఓపిక పడితే చాలు ప్రతీకూల పరిస్థితులన్నీ సర్దుకుంటాయని ఈ ప్రయాణంలో అర్థం చేసుకున్నా' అని చెప్పింది. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగు, హిందీ భాషల్లో ఆరు చిత్రాల్లో నటిస్తూ బిజీగా ఉంది.

కొరియన్ కనకరాజు

ఇదివరకు హారర్ కామెడీ సినిమాలంటే దాదాపు చిన్నసినిమాలే ఉండేవి. ఇప్పుడు స్టార్లు కూడా హారర్ కామెడీ చేసేస్తున్నారు. ప్రస్తుతం ప్రభాస్ చేస్తున్న 'రాజా సాబ్' సినిమా కూడా హారర్ కామెడీనే. ఈ నేపథ్యంలో త్వరలో మెగా హీరో వరుణ్ తేజ్ కూడా ఓ కామెడీ హారర్ మూవీ చేయబోతున్నారు. మేర్లపాక గాంధీ ఈ సినిమాకు దర్శకుడు. 'కొరియన్ కనకరాజు' టైటిల్‌ని కూడా ప్రస్తుతం పరిశీలిస్తున్నారు. రాయలసీమ నేపథ్య కథాంశం కావడం చేత ప్రస్తుతం రాయలసీమ యాసని ప్రాక్టీస్ చేసే పనిలో వరుణ్‌తేజ్ బిజీగాఉన్నారట. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ కలిసి ఈ సినిమాను నిర్మిస్తున్నాయి.

పరశురాముడి పాత్రలో

కెరీర్ ఆరంభం నుంచి విలక్షణ పాత్రల్లో రాణిస్తున్నారు బాలీవుడ్ నటుడు విక్కీ కౌశల్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న చారిత్రక చిత్రం 'ఛావా' ప్రస్తుతం షూటింగ్‌ను జరుపుకుంటున్నది. తాజాగా ఆయన పౌరాణిక కథాంశంలో నటించబోతున్నారు. పరశురాముడి నేపథ్యంలో రూపొందించబోతున్న చిత్రంలో ఆయన పరశురాముడి పాత్రను పోషించబోతున్నారు. నిర్మాత దినేష్ విజాన్ తెరకెక్కించబోతున్న ఈ భారీ బడ్జెట్ చిత్రం వచ్చే ఏడాది నవంబర్‌లో సెట్స్‌మీదకు వెళ్తుందని, ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ జరుగుతున్నదని బాలీవుడ్ సమాచారం. 'ఈ కథ వినగానే వెంటనే సినిమాకు అంగీకరించాను. పరశురాముడి ధైర్యసాహసాలను ఆవిష్కరిస్తూ భారీ యాక్షన్ హంగులతో ఈ సినిమాను రూపొందించబోతున్నారు' అని విక్కీ కౌశల్ పేర్కొన్నారు.

ఈ కథపై అశోక్ పేరు రాసుంది

'ఈ కథ రాసుకున్న తర్వాత చాలామంది హీరోలు మదిలో మెదిలారు. కానీ చివరకు ఇది గల్లా అశోక్ పరమైంది. దీనిపై అతని పేరు రాసుంది. సినిమా చూశాను. చాలా బావుంది. అర్జున్ అద్భుతంగా తీశారు. నిర్మాత బాలకృష్ణ సోమినేని ఖర్చుకు వెనుకాడలేదు. పనిచేసిన అందరికీ మంచి పేరు తెచ్చిపెట్టే సినిమా అవుతుంది.' అని డైరెక్టర్ ప్రశాంత్‌వర్మ అన్నారు. ఆయన కథ అందించిన చిత్రం 'దేవకీనందన వాసుదేవ'. అశోక్ గల్లా హీరోగా, అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో సోమినేని బాలకృష్ణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో ఈ చిత్ర కథకుడు ప్రశాంత్‌వర్మ మాట్లాడారు. అతిథులుగా విచ్చేసిన మాజీ పార్లమెంట్ సభ్యులు గల్లా జయదేవ్, దగ్గుబాటి రానా, సందీప్‌కిషన్‌లు యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. 'అద్భుతమైన కథను అందించిన ప్రశాంత్‌వర్మకు థ్యాంక్స్ చెప్పుకుంటున్నా. దర్శకుడు అర్జున్ జంధ్యాల తన విజన్‌తో ఈ కథకు ప్రాణం పోశారు. ట్రైలర్‌ని మించేలా సినిమా ఉంటుంది' అని అశోక్ గల్లా నమ్మకం వెలిబుచ్చారు. ప్రశాంత్‌వర్మ కథ, సాయిమాధవ్ బుర్రా సంభాషణలు, భీమ్స్ సంగీతం సినిమాను నెక్స్ట్ లెవల్లో నిలబెట్టాయని దర్శకుడు చెప్పారు. ఇంకా కథానాయిక మానస వారణాసితోపాటు చిత్రబృందమంతా మాట్లాడారు.

ప్రమాదకరమైన యువకుల ఆట

20ఏండ్ల క్రితం వచ్చిన '6 టీన్స్' చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతోన్న సినిమా 'రిస్క్ - ఏ గేమ్ ఆఫ్ యూత్'. సంగీత దర్శకుడు ఘంటాడి కృష్ణ స్వీయ దర్శకత్వంలో ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సందీప్ అశ్వా, తరుణ్ సాగర్, అర్జున్ ఠాకూర్, విశ్వేష్, సన్య ఠాకూర్, జోయా ఝవేరీ ఇందులో ప్రధాన పాత్రధారులు. ప్రమోషన్స్‌లో భాగంగా ఈ సినిమాలో రెండో పాటను నటుడు సత్యం రాజేశ్ లాంచ్ చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. 'ఓ హసీనా..' అంటూ సాగే ఈ పాటను ఘంటాడి కృష్ణ స్వరపరచగా, వరికుప్పల యాదగిరి రాసి, స్వయంగా ఆలపించారు. మర్డర్ మిస్టరీ కంటెంట్‌తో థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చే యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ ఇదని, డిసెంబర్ 27న సినిమాను విడుదల చేస్తున్నామని ఘంటాడి కృష్ణ తెలిపారు. రాజీవ్ కనకాల, అనీష్ కురువిళ్ల ప్రత్యేక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జగదీష్ కొమరి.